క్లుప్తంగా

రోడ్డు మరమ్మతులు షురూ..



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

యాచారం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. స్థానికులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేయడంతో రోడ్లకు మరమ్మతులు చేశారు. యాచారం నుంచి కందుకూర్ వరకు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. దీంతో స్థానికులు ఎంపీడీఓ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎంపీడీఓ, ఆర్అండ్బీ డీఈఈ వేణుగోపాల్‌రెడ్డికి సమాచారమిచ్చారు. రోడ్డుపై పడిన గుంతలను జేసీబీతో పూడ్చారు. వర్షాలు తగ్గిన తర్వాత యాచారంలోని అంబేడ్కర్ చౌరస్తాలో శాశ్వతంగా సీసీ రోడ్డు నిర్మిస్తామని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీఓ విజయలక్ష్మి సందర్శించారు. గ్రామంలోని పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీలో ఉన్న రికార్డులను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల ద్వారా ఖర్చు చేసే అభివృద్ధి పథకాలకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. లేని పక్షంలో కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఎరువుల వాడకంలో తొందరపడవద్దు

ఏడీఏ సత్యనారాయణ



కొత్తపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సత్యనారాయణ

యాచారం: పంటల సాగులో ఎరువుల వాడకంలో అవగాహన కలిగి ఉండాలని, తొందరపడి అధికంగా ఎరువులు వాడకూడదని ఇబ్రహీంపట్నం ఏడీఏ సత్యనారాయణ రైతులు సూచించారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి.. పత్తి, వరి, జొన్న తదితర పంటల సాగులో ఎరువుల వాడకంపై రైతులకు పలు సూచనలు చేశారు. పొలాల్లో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంటల సాగు, ఎరువులు, విత్తనాల వాడకంపై వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐలకు సన్మానం



సీఐ, ఎస్ఐలను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు నూతన సీఐగా వెంకటేశ్వర్లు, ఎస్ఐగా బాల్‌రాంనాయక్‌లు ఇటీవల బాధ్యతలు తీసుకున్న నేపథ్యంలో ఆమనగల్లు మండల, పట్టణ బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. ఆమనగల్లు పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం సీఐ, ఎస్ఐలను ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, ఎంపీటీసీ సరిత పంతునాయక్‌ల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జయరాం నాయక్, బీఆర్ఎస్ నాయకులు ఉప్పల రాములు, రామకృష్ణ, సయ్యద్ ఖలీల్, బాలస్వామి, వెంకటేశ్, రవీందర్ నాయక్, రమేశ్ నాయక్, సాయిలు, శివకుమార్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేను కలిసిన మంగమ్మ, శివకుమార్

తుర్కయంజాల్: ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే జన్మదినం సందర్భంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ మంగమ్మ, పీసీసీ నాయకులు శివకుమార్ శుక్రవారం బెంగుళూరులో ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం తగదు



తలకొండపల్లిలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్

ఆర్డీవో అనంతరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి

ఇబ్రహీంపట్నం: ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో బీఎల్ఓ, సూపర్‌వైజర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అనంతరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల బాధ్యతల నిర్వహణను నిర్ణిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. 18 ఏళ్ల నిండినవారిని ఓటర్లుగా నమోదు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఓటరు జాబితాలో తప్పుఒప్పులను, మార్పులు, చేర్పులను సరిచేయడంలో బీఎల్ఓల పాత్ర కీలకమన్నారు. పనితీరు మెరుగుపరుచుకునేందుకు బీఎల్ఓలకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎల్. రామ్మోహన్, నాయబ్ తహసీల్దార్ కె శ్రీనివాస్, మండల ఆర్ఐలు పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ నమోదును పకడ్బందీగా చేపట్టాలి

తలకొండపల్లి: ఓటు నమోదును పకడ్బందీగా అమలు చేయాలని డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ అన్నారు. 18 ఏళ్ల నిండిన యువతీయువకులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు ఓటు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పాల్గొని మాట్లాడారు. బీఎల్ఓల విధులు.. ఓటర్ జాబితాలో ఫామ్ 6, ఫామ్7ల గురించి అవగాహన కల్పించారు. ఓటర్ జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించాలని చెప్పారు. అక్టోబర్ 4న ఓటర్ తుది జాబితా విడుదలవుతుందని తెలిపారు. అక్టోబర్ 1 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారని తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ బాలవర్ధన్, ఆర్ఐ మంజుల, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

తుర్కయంజాల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపైన ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని అబ్దుల్లాపూర్‌మెట్ డిప్యూటీ తహశీల్దార్ వేణు తెలిపారు. శుక్రవారం కమ్మగూడలోని వార్డు కార్యాలయంలో ఈవీఎంలపై అవగాహన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ ఐలయ్య, ఆర్ఐ బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన

యాచారం: మండలంలోని మంతన్‌గౌరెల్లి గ్రామంలో శుక్రవారం ఈవీఎంల వాడకంపై రెవెన్యూ అధికారులు ఓటర్లకు అవగాహన కల్పించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈవీఎంలను ప్రదర్శించి ఓటే ఎలా వేయాలో తెలియజేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈవీఎంలను ఉపయోగించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు ఎంతో విలువైందని, కీలకమైన ఓటును వృథా చేసుకోవద్దని ఓటర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వియలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలకు శిక్షణ

కడ్తాల్: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం బీఎల్ఓలకు, బీఎల్ఓ సూపర్‌వైజర్లకు భారత ఎన్నికల కమిషన్ నియమాల ప్రకారం ఒక్క రోజు అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై బూత్ లెవెల్ అధికారులకు కల్వకుర్తి ఆర్డీవో శ్రీను సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ వినోద్‌కుమార్, ఆర్ఐ రాకేశ్, జూనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న చీపునుంతల గ్రామస్తులు, సర్పంచ్‌లు

చీపునుంతల, తుమ్మలకుంటతండా వాసుల ధర్నా

తలకొండపల్లి: చీపునుంతల, తుమ్మలకుంటతండాల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడించి, కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏఈ కటారియాకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. రెండు గ్రామాల్లో 5 రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారుల దృష్టికి తెచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీంతో శుక్రవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించామని గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కరెంట్ సమస్యను పరిష్కరించేంత వరకు ఇక్కడి నుంచి కదిలేదని భీష్మించుకు కూర్చున్నారు. సమస్యను పరిష్కరిస్తామని ఏఈ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు. ధర్నాలో సర్పంచ్‌లు రఘుపతి, లక్ష్మణ్‌నాయక్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆగిన వర్షం



వర్షాలకు నిండిన మల్‌శెట్టిగూడ చెక్‌డ్యాం

ఇబ్రహీంపట్నం: మూడు రోజులుగా ఇబ్రహీంపట్నంలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం శుక్రవారం ఉదయం పదిగంటల నుంచి ఆగింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి. ముసురు వల్ల వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడ్డారు. ఇబ్రహీంపట్నం మండలంలో 4 రోజుల పాటు ఉదయం 8 గంటలలోపు నమోదైన వర్షపాతం వివరాలు. మంగళవారం 18 మి.మీటర్లు, బుధవారం 17 మీ.మీ. గురువారం 8.3 మీ.మీ. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు కురిసిన వర్షపాతం 33.2 మీ.మీటర్లుగా నమోదైయింది. ఈ వర్షాలకు పలు కుంటలకు, చెక్‌డ్యాంలకు నీరు వచ్చి చేరింది. మల్‌శెట్టిగూడ, శేరిగూడ గ్రామాల మధ్య ఉన్న చెక్‌డ్యాం నిండి అలుగుపారుతుంది. తట్టిఖానా చెక్‌డ్యాం నిండుకుండాల మారింది. వరుణుడి కటాక్షం కోసం ఎదురుచూస్తున్న రైతాంగానికి ఈ వానలు ఆనందాన్నిచ్చాయి.

సాధించే వరకు పోరాటం ఆగదు



మండల సాధనకోసం దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు తదితరులు

కాంగ్రెస్ నేత డేవిడ్

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత డేవిడ్ డిమాండ్ చేశారు. మండలాన్ని సాధించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరహార దీక్ష శుక్రవారానికి 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ మండల ఏర్పాటుకు కావాల్సిన అన్ని సదుపాయాలు ఉన్నాయని, అభివృద్ధి పరంగా గట్టుఇప్పలపల్లి అన్ని రంగాల్లో ముందంజలో ఉందన్నారు. గతంలో 41 రోజులు దీక్షలు చేశామని, ప్రస్తుతం 19 రోజులుగా దీక్ష చేపడుతున్నామని తెలిపారు. ఇటీవల మండలం ఏర్పాటు చేయాలని 12 మంది గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు తమ పదవులకు రాజీనామా చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రులు, ఆర్డీఓ కలెక్టర్‌లకు వినతిపత్రాలిచ్చినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చేవరకు దీక్షలు కొనసాగుతాయని ఆయన ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు పవన్, జంగయ్య, అశోక్, మాజీ సర్పంచ్ జంగమ్మ, దామోదర్, బాలస్వామి, రేణురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్లు

తుర్కయంజాల్: పురపాలక సంఘం నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ శ్రీకాంత్‌ను శుక్రవారం పలువురు కౌన్సిలర్లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

కమిషనర్‌కు సన్మానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నూతన కమిషనర్‌గా రవీంద్రసాగర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శుక్రవారం కమిషనర్‌ను టీపీఓ దినేశ్, శ్రీ నిలయ బిల్డింగ్ ప్లానర్ సీహెచ్ రాఘవేందర్ సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం

కడ్తాల్: మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామానికి చెందిన గంటికోట వజ్రమ్మ అనారోగ్యంతో శుక్రవారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబీకులను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్, సర్పంచ్ రామునాయక్, నాయకులు కృష్ణయ్య, స్కైలాబ్, అశోక్, అర్జున్, వీరయ్య, శ్రీను, పురుషోత్తం, శివరాజు, యాదగిరి, రాజు, షారుఖ్ ఉన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండలంలోని బోడియా తండాకు చెందిన ఓ చిన్నారి శుక్రవారం మృతిచెందగా.. విషయం తెలుసుకున్న మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, సర్పంచ్ స్వప్నాబాస్కర్ రెడ్డిలు చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం చెరో రూ.3వేల ఆర్థిక సాయం చేశారు. అదే విధంగా వెల్జాల్‌లో మృతిచెందిన నారాయణ (61) కుటుంబ సభ్యులను మాజీ ఎంపీపీ శ్రీనివాసుయాదవ్ పరామర్శించి రూ.3వేలు సాయం చేశారు. చంద్రధనలో గురువారం రాత్రి మృతి చెందిన ముసిలి జంగమ్మ(56) కుటుంబాన్ని ఉప సర్పంచ్ సుధాకర్ పరామర్శించి, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు అందజేసిన రూ.3వేలను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ రఘువర్ధన్‌రెడ్డి, వార్డు సభ్యులు యాదయ్య, దస్తగిరి, రైతు సమన్వయ సమితి కమిటి అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోండి

మహేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రైతుబీమా పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి సూచించారు. 2023- 24 సంవత్సరంలో కొత్త పట్టా పాసు బుక్ వచ్చిన రైతులు, ఇంతకు ముందు దరఖాస్తు చేసుకోని వారందరూ వెంటనే అప్లయ్ చేసుకోవాలని తెలిపారు. పట్టాదారు పాస్ బుక్, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలు, బీమా ఫారంతో వచ్చి స్థానిక రైతు వేదికలో అందజేయాలని సూచించారు.

గుర్రంగూడ అభివృద్ధికి వినతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడను అభివృద్ధి స్థానిక కార్పొరేటర్లు గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్ శుక్రవారం మంత్రి సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గుర్రంగూడలోని ఎక్కంకుంట చెరువు సుందరీకరణ కోసం రూ.50 లక్షలు మంజూరు చేయాలని కోరామన్నారు. అల్మాస్‌గూడ నుంచి గుర్రంగూడ వరకు రోడ్డు పనులకు గాను ఇప్పటికే రూ.3 కోట్లు కేటాయించారని తెలిపారు. అయితే ఇందుకు సంబంధించిన పనులను పూర్తి కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని మంత్రికి విన్నవించినట్లు తెలిపారు.

ఏసీపీకి సన్మానం



షాద్‌నగర్‌లో ఏసీపీని సన్మానిస్తున్న సర్పంచ్, తదితరులు

తలకొండపల్లి: షాద్‌నగర్ డివిజన్ నూతన ఏసీపీ రంగస్వామిని దేవుని పడకల్ సర్పంచ్ కాడమోని శ్రీశైలం ఘనంగా సన్మానించారు. షాద్‌నగర్ డివిజన్‌లో ఏసీపీగా పనిచేసిన కుశాల్కర్ ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో షాద్‌నగర్ డివిజన్ ఏసీపీ రంగస్వామి బాధ్యతలు చేపట్టారు. శ్రీశైలం శుక్రవారం ఏసీపీని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సత్యం, మల్లేశ్ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జీపీ కార్మికులకు మద్దతు తెలుపుతున్న సీపీఐ నేతలు

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కారించాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. 16 రోజులుగా ఇబ్రహీంపట్నంలో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులకు సీపీఐ నేతలు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కృష్ణ, లక్ష్మయ్య, విజయ్‌కుమార్, ములుగు నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు జల్‌పల్లిలో బోనాలు

- ముస్తాబవుతున్న ఆలయాలు
- ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులు



పోచమ్మ ఆలయం వద్ద పెయింటింగ్ వేయిస్తున్న కౌన్సిలర్ యాదగిరి

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని దేవాలయాలు బోనాల పండగకు ముస్తాబవుతున్నాయి. ఆదివారం బోనాలను పురస్కరించుకొని గ్రామంలోని రెండు పోచమ్మ దేవాలయాలు, మల్లన్న దేవాలయాల వద్ద మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు. 16వ వార్డు కౌన్సిలర్ బుడుమాల యాదగిరి శుక్రవారం ఆలయాలకు రంగులు వేయించారు. ఆదివారం నిర్వహించే వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. సోమవారం తొట్టెల, పోతరాజులు ఊరేగింపు ఉంటుందని స్పష్టంచేశారు. నగరంలో ఆషాఢ మాసం బోనాల అనంతరం జల్‌పల్లిలో బోనాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. గ్రామస్తులందరూ ప్రశాంత వాతావరణంలో పండుగలు చేసుకోవాలని కోరారు.

అవిశ్వాసాన్ని ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు ఎంపీపీ అనితపై ఎంపీటీసీ సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాణాన్ని ఉపసంహరించుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితీ రాష్ట్ర కార్యదర్శి విజయ్‌రాథోడ్, మేడిగడ్డ తండా ఉపసర్పంచ్ మల్లేశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఎంపీపీ చేసిన తప్పేంటో చెప్పాలని ప్రశ్నించారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో నేతలు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన అనితపై సొంత పార్టీ ఎంపీటీసీలే అవిశ్వాస తీర్మాణం పెట్టడాన్ని తప్పుబట్టారు. నాయకులు తావుర్యానాయక్, లక్ష్మణ్, శంకర్, తావు, సీతు, శ్రీను, రమేశ్, భాస్కర్, నరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

58, 59 జీఓ అర్జీలపై విచారణ



విచారిస్తున్న గిరిజ, రెవెన్యూ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీరణకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. ఇబ్రహీంపట్నం మండలంలో జీఓ నెంబరు 58, 59 కింద వచ్చిన దరఖాస్తుల విచారణ కొనసాగుతుంది. శుక్రవారం నాగన్‌పల్లి, రాయపోల్, దండుమైలారం తదితర గ్రామాల్లో ఈ జీఓ ప్రకారం పెట్టుకున్న దరఖాస్తులదారుల ఇళ్లకు వెళ్లి విచారణ చేస్తున్నారు. మండలంలో 58 జీఓ కింద 174, 59 జీఓ కింద 365 దరఖాస్తులు వచ్చాయి. విచారణాధికారి గిరిజతో పాటు ఆర్ఐ పుష్పలత, రెవెన్యూ సిబ్బంది దరఖాస్తులను పరిశీలించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



భాస్కర్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటేశ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణ బీఆర్ఎస్ యువజన విభాగం ఉపాధ్యక్షుడు భాస్కర్ తండ్రి నూతన గంటి కృష్ణయ్య గురువారం రాత్రి మృతిచెందాడు. భాస్కర్ కుటుంబసభ్యులను శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, పలువురు బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబసభ్యులకు గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు.

రేపు టీడీపీ కార్యాలయం ప్రారంభం

మీర్‌పేట: టీడీపీకి పూర్వవైభవం తెచ్చేందుకు త్వరలో నియోజకవర్గంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకుడు, మీర్‌పేట కార్పొరేటర్ ఎడ్ల మల్లేశ్ ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మీర్‌పేట ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీలో నూతనంగా నిర్మించిన నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ కంభంపాటి రామ్మోహన్‌రావు తదితరులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా మందమల్లమ్మ చౌరస్తా నుంచి జిల్లెలగూడ, మీర్‌పేట మీదుగా ర్యాలీ నిర్వహించనున్నట్లు స్పష్టంచేశారు. భౌగోళిక తెలంగాణ మాత్రమే వచ్చిందని, బహుజనుల తెలంగాణ రాలేదని, 2014 ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీకి 22 శాతం ఓట్లు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. టీడీపీతోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. పార్టీ ప్రారంభోత్సవం, పాదయాత్రను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ చేవెళ్ల పార్లమెంటు బీసీసెల్ అధ్యక్షులు కొమరేష్, నాయకులు ముత్యాల వాసు సాగర్, శ్రీశైలం, ఆసిఫ్, మల్లేశ్, రామునాయక్, బాలరాజు, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నర్సింగ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మల్లేశ్ ముదిరాజ్